
గర్ల్ ఫ్రెండ్
వంక సరస్వతి
CHA

ఎలాగైతేనేం, ముష్టి యుద్ధం చేసి బస్సులో పడ్డాడు సంతోష్. అతని కాలు ఒకటి క్రింద ఉండగానే రైట్ చెప్పేశాడు కండక్టరు. బస్సు లోపల ముందరివాళ్ళు వెనకవాళ్ళని, వెనక వాళ్ళు ముందరివాళ్ళని తోసుకుంటున్నారు. ఎలాగో అందర్నీ తప్పించుకుని ముందరికి వచ్చి నిలబడేసరికి తలప్రాణం తోకకి వచ్చింది.

—అమ్మయ్య అని ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు సంతోష్.

ప్రసవానికి సిద్ధంగా ఉన్న స్త్రీలా నడవలేక నడుస్తున్నట్లు భారంగా కదుల్తోంది డబుల్-డక్కర్ బస్.

కుడిచేత్తో బస్ కమ్మీకి వ్రేలాడుతున్న బెల్ట్ పట్టుకుని, రెండవ చేతిలో ఉన్న కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటున్న సంతోష్ దృష్టి నాకర్షించింది ముందర సీట్లో కూర్చున్న, పసుప్పచ్చ పరికిణీమీద నల్లవోణీ వేసుకున్న సుందరాంగి. ఆ చిన్నారి ఒడిలో మరో చిన్న వెండికప్పు—బహుమతి కాబోలు. రెండు చేతుల్తో దాన్ని పట్టుకుని దానివైపే చూస్తోందా అమ్మాయి. అలా కూర్చున్న ఆ అమ్మాయి సంతోష్ కంటికి ముగ్ధ మనోహరంగా కనిపించింది.

'—ఎక్కడో చూసినట్లుగా వుందే ఈ అమ్మాయిని' అనుకుంటూ జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు.

ఎందుకో తలెత్తిన ఆ అమ్మాయి కళ్ళు 'నువ్వు నాకు తెల్సులే' అన్నట్లు పల్కరించాయి సంతోష్‌ని.

అబ్బో! ఎంత బావున్నాయో ఆ కళ్ళు. కోటేరులా వున్న ఆ ముక్కు మరీ ముద్దొచ్చేస్తోంది సంతోష్‌కి. ఇన్నాళ్ళూ తన ఊహల్లో తిరుగాడిన సుందరి ఈ పిల్లే ననిపించింది. ఈ అమ్మాయిని ఎలాగైనా పరిచయం చేసుకుని తనదాన్ని చేసుకోవాలి. గట్టిగా నిర్ణయించుకున్నాడు.

ఇన్నాళ్ళకి తనకి ఒక పిల్లంటూ నచ్చినందుకు తన తల్లి దండ్రులు సంతోషిస్తారు. కానీ 'బొత్తిగా చిన్న పిల్లరా' అంటుందేమో అమ్మ. ఈ అమ్మాయికి మహా ఉంటే పదిహేనే వుంటాయి. అంటే తన వయసులో సగం అన్నమాట.

అయితే మాత్రమేం? ఆడవాళ్ళు యిద్దరు పిల్లలు పుట్టేసరికి ఆరిందాలు అయిపోతారు. తనకాబోయే భార్య చిన్నది గాబట్టి, ఒకళ్ళిద్దరు పిల్లలు పుట్టినా, అప్పుడే యవ్వనంలోకి అడుగు పెట్టిన నవజవ్వనిలాగే ఉంటుంది. తనని చూసి తన ఫ్రెండ్సంతా అసూయ పడాలపుడు.

బస్సు ఆగింది. దిగినవాళ్ళు లుగు

రైతే, ఎక్కినవాళ్ళు పదిమంది పైనే ఉన్నారు. "అందర్ జావ్, అందర్ జావ్'' అంటూ తలుపు దగ్గర నుంచుని వెనకవాళ్ళనందర్నీ ముందుకు తోస్తున్నాడు కండక్టరు.

ఎవరో గట్టిగా కాలు తొక్కటంతో 'అబ్బా' అనబోయి, ఎదురుగా ఆ అమ్మాయిని చూసి బలవంతంగా బాధని దిగమింగుకున్నాడు సంతోష్.

సంతోష్ ఏడుపుమొహం చూసి చిన్నగా నవ్విందా అమ్మాయి ఆ నవ్వు చూసి తన కాలిబాధ మర్చిపోయాడు. ఆ అందాన్ని పూర్తిగా ఆస్వాదించకుండానే సంతోష్‌కి ఆ సుందరాంగికి మధ్యగా ఎవడో వచ్చి నిలబడ్డాడు సైంధవుడిలా.

మనసులోనే కసితీరా సైంధవుడ్ని తనకి వచ్చిన తిట్లన్నీ తిట్టేస్తున్నాడు సంతోష్.

ఎంత ప్రయత్నించినా సుందరి మొహం కనిపించకపోయేసరికి విసుగొచ్చి, ఆ ప్రయత్నం మానుకుని కిటికీలోంచి బయటికి చూస్తోన్న సంతోష్‌కి, ఆ అమ్మాయి చేతిలో వెండి కప్పు జ్ఞాపకం వచ్చింది.

—స్కూల్లోనో, కాలేజీలోనో పాటలు పాడి ఫస్ట్‌ప్రైజ్ కొట్టేసుంటుంది. అందుకే అంత గర్వంగా చూసుకుంటోంది కప్పుని ... తనకాబోయే భార్య తెలివితేటల్ని తలుచుకుని మురిసిపోయాడు.

ఏదో స్టాప్ రావడం గమనించి తల తిప్పి చూసిన సంతోష్, సుందరి దిగిపోవడం చూసి కంగారుపడ్డాడు. తను దిగవలసినది నెక్స్ట్ స్టాప్. కండక్టర్ బెల్ కొట్టడం చూసి తనూ గబగబ దిగిపోయి, ఆ అమ్మాయికి గజం దూరంలో నడువసాగాడు.

ఎండ మొహంమీద పడింది కాబోలు, కళ్ళు చిట్లించి, ఎడంచేత్తో ముంగురులు సరిచేసుకుంటూ ఉంటే చూస్తూ మహా ముచ్చటపడిపోయాడు సంతోష్.

ప్రక్కనే నడుస్తూ "ఏవండీ" అన్నాడు.

'ఏమిటి?' అన్నట్లు చూసింది.

"మీతో కొంచెం మాట్లాడాలనుకుంటున్నాను." ధైర్యంగా అన్నాడు

"ఏమిటోచెప్పండి," అంది నడవటం మానేసి.

—ఇదేమిటి ఈమె గొంతు యిలా వుంది జలుబు గొంతులా ?

ఓహో! అన్నట్లు పాటలు చాలా పాడి వుంటుంది కదూ. అందుకని బొంగురుపోయి ఉంటుంది. జాలిపడిపోయాడు మనసులో.

నాందిగా ఏదో మాట్లాడాలి గాబట్టి "మీ గొంతు బొంగురుపోయినట్లుందే ?" అన్నాడు.

"ఇది చెప్పటానికే పిలిచారా?" నవ్వింది అమ్మాయి.

"అహ, హ, కాదు. మీతో ఒక ముఖ్యవిషయం గురించి చెప్పాలనుకుంటున్నాను. అది చెప్పే ముందర నా గురించి వినండి. నాకు ప్రేమ కబుర్లు చేతకావు. చెప్పేదేదో డైరెక్టుగా చెప్తాను.

"నేను స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాను. బి. కామ్. పాసయ్యాను. మాకు తిని కూర్చున్నా తరగనంత ఆస్తి ఉంది. అయినా ఉద్యోగం పురుష లక్షణం గాబట్టి చేస్తున్నాను. ఇంక అందం అంటారా? అది మీరు చూస్తూనే ఉన్నారు. నేను మీకు నచ్చితే మనిద్దరం వివాహం చేసుకుందాం. మీ అభిప్రాయం చెబితే మీ పెద్దవాళ్ళతో మాట్లాడతాను. ఏమంటారు?" అన్నాడు.

అంతవరకూ బిగపట్టుకున్న నవ్వు ఆగలేదా అమ్మాయికి.

"నవ్వుతున్నారెందుకు?" మనసులో చిరాకనిపించినా, పైకి శాంతంగానే అడిగాడు.

"మన పెళ్ళి జరగదు గాబట్టి" అంది.

"ఏం, మీ వాళ్ళు ఒప్పుకోరా? లేక మీకేమైనా అభ్యంతరమా?" ఆతృతగా అన్నాడు.

అదేదీ కాదన్నట్లు తల అడ్డంగా ఆడించింది.

"మరి?" ఆశ్చర్యంగా ఉందతనికి.

"నేను అమ్మాయిని కాదు గాబట్టి." మెల్లిగా అంది.

"అదేమిటి?" తెల్లబోతూ అడిగాడు.

(ఆ మాట అతనికి చెప్పలేనంత ఆశ్చర్యాన్ని కల్గించింది. చటుక్కున ఏదో స్ఫురించినట్లైంది. కొంపదీసి ఈ సుందరి అర్ధనారీశ్వరుడు కాదుగదా?)

అతని ఆశ్చర్యానికి జవాబుగా "నా పేరు గోపి సార్. మా స్కూల్లో 'ఫాన్సీడ్రెస్' పోటీలో అమ్మాయిగా నటించినందుకు మొదటి బహుమతి వచ్చింది. మా వాళ్ళని కూడా ఆశ్చర్య పరుద్దామని డ్రెస్ మార్చకుండా యింటికి వెళ్తున్నాను." గర్వంగా వెండి కప్పుతేసి చూసుకుంటూ చెప్పాడు గోపి, సదరు సుందరాంగి.

